

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు సన్మానిస్తున్న నందగిరి నర్సింహ తదితరులు

బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

ముషీరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త అంకితభావంతో పని చేయాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సభ్యుడిగా నియమితులైన భోలక్‌పూర్‌కు చెందిన దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందగిరి నర్సింహ కె.లక్ష్మణ్‌ను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారిని బీజేపీకి చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్, బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రమోహన్, పరిమళ్‌కుమార్, సత్యనారాయణ, నాయకులు శేఖర్, సతీష్ పాల్గొన్నారు.



ఫూల్‌బాగ్‌లో టీడీపీ సభ్యత్వం ప్రారంభిస్తున్న పి.సాయిబాబా తదితరులు

టీడీపీ సభ్యత్వాన్ని పెంచాలి

కవాడిగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేయడానికి అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వం నిర్వహించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. కవాడిగూడ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు జి.యాదగిరిరావు ఆధ్వర్యంలో మంగళవారం దోమల్‌గూడ ఫూల్‌బాగ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పి.సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై సభ్యత్వాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాయకత్వంలో హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలకు తెలియజేస్తూ సభ్యత్వం చేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. 100 రూపాయలు చెల్లించి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ కవాడిగూడ కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి శోభారాణి, నాయకులు భవానీశ్రీనివాస్, ప్రభావతి, సుగుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సర్వేలో 21 రకాల వైకల్యాలకు చోటు కల్పించాలి'

రాంనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో 21 రకాల వైకల్యాలకు చోటు కల్పించి సర్వే చేయాలని కోరుతూ రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ మంగళవారం లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో వివరించారు. సకలాంగులకు ఇచ్చిన ప్రాధాన్యంను దివ్యాంగులను ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగులను పట్టించుకోకుండా మోసం చేసిందని, అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వమూ మోసం చేస్తోందని ఆరోపించారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 21 రకాల వైకల్యాలను సర్వేలో పొందుపరచాలని కోరారు. కార్యక్రమంలో కాటమనేని వెంకటేష్‌గౌడ్, వి.భారతి తదితరులు పాల్గొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, అధికారులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధిపనులు నిర్వహించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని అశోక్‌నగర్ సమీపంలోని చిక్కడపల్లి ఎస్‌బీహెచ్ కాలనీలో ఇటీవల ప్రారంభించిన నూతన సీవరేజి పైప్‌లైన్ పనులను మంగళవారం వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తదితరులతో కలిసి ఆమె పరిశీలించారు. దాదాపు రూ.31 లక్షల అంచనావ్యయంతో ఈ పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. ఈ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, సురేందర్, సాయికుమార్, ఆనంద్‌రావు, సంయుక్తరాణి, విశ్వనాథ్, విఠల్, రవీందర్, మనోహర్, వెంకటేశం పాల్గొన్నారు.

కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మధురానగర్ కాలనీలో కలుషిత నీటి సమస్యను పరిశీలిస్తున్న పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సమస్య ఉందని, కలుషిత తాగునీటి కారణంగా స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం జలమండలి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. మంగళవారం డివిజన్‌లోని మధురానగర్ కాలనీలో తాగునీటిలో మురుగునీరు కలుస్తుందని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. తాగునీటి సరఫరాలో లోప్రెషర్, కలుషిత నీరు వంటి సమస్యలను ఆయా ప్రాంతాల జలమండలి అధికారులు వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మిరియాల శ్రీనివాస్, న్యాయవాది శ్రీహరి, సంపత్, అర్జున్, సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరఫరాలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



అంబర్‌పేటలో రేషన్ షాపును తనిఖీ చేసిన సివిల్ సప్లై ఏఎస్‌ఓ దీప్తి తదితరులు

నల్లకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల సరఫరాలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దు చేస్తామని సివిల్ సప్లై 6వ సర్కిల్ ఏఎస్‌ఓ దీప్తి హెచ్చరించారు. ఈ మేరకు సర్కిల్ పరిధిలోని షాపులను తనిఖీలకు శ్రీకారం చుట్టామని ఆమె పేర్కొన్నారు. మంగళవారం ఆమె పలు రేషన్ షాపులను తనిఖీలు చేశారు. ఈనెల 8వ తేదీన అంబర్‌పేటలోని రేషన్‌షాపు నెంబర్ 680లో ఉండాల్సిన వాటి కంటే 33 కేజీల గోధుమలు, 45 కేజీల రైస్ ఎక్కువగా ఉన్నందున ఆ షాపు డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిర్ణీత సమయం ప్రకారం షాపులన తెరిచి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఎవరైనా సరుకులు బ్లాక్ మార్కెట్‌కు విక్రయిస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

● నివాళి



గోల్నాక డివిజన్‌లో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలుగా పని చేస్తున్న సులోచన గుండెపోటుతో మంగళవారం మృతి చెందడంతో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేలు కుటుంబసభ్యులకు అందజేశారు.

\- గోల్నాక, ఆంధ్రజ్యోతి

శంకుస్థాపనకు 13 ఏళ్లు

- నేటికీ ప్రారంభం కాని కనెక్టివ్ బ్రిడ్జి పనులు
- గోల్నాక చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు
- 2011లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన

గోల్నాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోల్నాక చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య నివారించడానికి గోల్నాక కొత్త బ్రిడ్జి నుంచి కృష్ణానగర్ వరకు నిర్మించ తలపెట్టిన కనెక్టివ్ బ్రిడ్జి కోసం 2011లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాలక్రమంలో 13 ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటికి బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. దీంతో గోల్నాక చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తులవుతామని ఆశ పడిన ప్రజలకు నిరాశే మిగిలింది. గోల్నాక చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కొత్త బ్రిడ్జి నుంచి కృష్ణానగర్ వరకు కనెక్టివ్ బ్రిడ్జిని నిర్మించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. దీని కోసం రూ.5 కోట్ల 75 లక్షలు నిధులు మంజూరు చేసి 2011 ఆగస్టు 21న అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం కాకుండానే నిలిచిపోయాయి. కృష్ణానగర్‌లో పలువురి పేదల ఇళ్లను తొలగించాల్సి ఉండడంతో స్థానికంగా వారు వ్యతిరేకించడంతో సమస్య మొదలైంది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. గోల్నాక కొత్తబ్రిడ్జి నుంచి కృష్ణానగర్ వరకు బ్రిడ్జి నిర్మాణం అయితే దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి చాదర్‌ఘాట్, కోఠికి వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించి అధికారులు ఆపై మిన్నకుండడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



2011లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఫ్లై ఓవర్ నిర్మాణంతో కష్టాలు డబుల్

ప్రస్తుతం అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనులు కొనసాగుతుండడం, మరోవైపు మూసారాంబాగ్ మూసీనదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల నుంచి వెళ్లాల్సిన వాహనాలన్నీ గోల్నాక నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో రోడ్ల నిర్మాణం

ముషీరా'బ్యాడ్' రోడ్లు శీర్షికకు స్పందించిన ఎమ్మెల్యే

చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో తర్వలో రోడ్లకు మహార్దశ పట్టనుంది. త్వరలో కొత్త రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ముషీరా'బ్యాడ్'రోడ్లు శీర్షికతో ప్రచురితమైన రోడ్ల అధ్వాన్నస్థితి ఫోటోలపై ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ డివిజన్‌లోని త్యాగరాయగాన సభ నుంచి ఆంజనేయస్వామి ఆలయం వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఈ విషయం అందరికీ తెలియడంతో ఉదంతం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా డివిజన్‌లోని గాంధీనగర్ ఎస్‌బీఐ వద్ద రోడ్డు నిర్మించాలని సూచించినట్లు వివరించారు. త్వరలోనే ఈ రెండు నూతన రోడ్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ముఠా గోపాల్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

'కేటీఆర్ ప్రోద్బలంతోనే అధికారులపై దాడులు'

బర్కత్‌పుర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి కేటీఆర్ ప్రోద్బలంతోనే వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడులు జరిగాయని, ఈ సంఘటనకు బాధ్యుడైన కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులపై పాశవిక దాడి ముందస్తు పథకం ప్రకారమే జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఉద్యోగులపై దాడి చేసి లబ్ధి పొందాలని బీఆర్ఎస్ కుట్ర చేయడం దిక్కుమాలిన చర్య అన్నారు. దాడికి పాల్పడిన సురేష్ ఫోన్ నుంచి పట్నం నరేందర్‌రెడ్డికి, కేటీఆర్‌కు పలుమార్లు ఫోన్‌కాల్స్ వెళ్లడం అనేక అనుమానాలకు దారి తీస్తుందన్నారు. వి.వి.గౌడ్, సాయిబాబా, రాఘవేందర్, నగేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

తెలుగులో సమగ్ర పదకోశం అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ లక్ష్మణ్ తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొరుగురాష్ట్రాల వారు తమ భాషలకు చెందిన పదకోశం సమగ్రంగా ఉన్నందున అక్కడ తీర్పులు త్వరితంగా అనువాదం అవుతున్నాయి కానీ తెలుగు భాషలో ఇందుకోసం సమగ్రమైన పదకోశం అవసరం ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తమ బాషలో తీర్పులు తెలుసుకోవడం అవసరం అన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో 52 మంది రచయితలు రాసిన కొత్త కథలు 6వ భాగం ఆవిష్కరణసభ జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ లక్ష్మణ్ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. వాస్తవాన్ని కథలరూపంలో అందించే రచయితలు సమాజహితానికి దోహదపడతారన్నారు. నేడు అత్యధిక కేసులు ప్యామిలీ కోర్టుల్లో ఉండటానికి కారణం సమాజానికి సరైన దిశానిర్దేశం లేకపోవడం అన్నారు. అధ్యక్షత వహించిన సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. సమాజ జీవితానికి, మనిషిజీవితానికి సంబంధం తెలిపేదే కథ అన్నారు. భారతీయ సాహిత్య చరిత్ర కథతోనే ఆరంభం అయిందన్నారు. గ్రంథస్వీకర్త డా. ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి హృద్రోగ నిపుణులుగా అమెరికాలోఉన్నా కూడా తెలుగుభాష సంస్కృతి సంప్రదాయాలను గొప్పగా అభిమానించే వ్యక్తిత్వం కలవారని అభినందించారు. తెలుగు యూనివర్శిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ సంపుటిలోని కథల్లో వస్తువైవిధ్యం, ప్రాంత వైవిధ్యం శైలి వైవిధ్యం ఉన్నాయన్నారు. కృతిస్వీకర్త ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో స్థిరనివాసంగా ఉన్నా సినారె, వంశీ సంస్థల సంపుటిల ప్రచురణకు సహకారం అందిస్తున్నానన్నారు. ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య సూర్య ధనుంజయ్, జర్నలిస్ట్ మాశర్మ, దర్శకుడు రేలంగి నరసింహారావు, నాట్యగురువు డా.ప్రసన్నరాణి, గాయని శారద ఆకునూరి తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు సమన్వయం చేశారు. డా. తెన్నేటి సుధాదేవి స్వాగతం పలికారు. తొలుత జమున సంస్మరణలో ఆమె నటించిన సితామాలలోని పాటలు రామకృష్ణ, సాయిమేఘన, తుషారనిలయ మధురంగా గానం చేశారు.

నీటి సమస్యలను పరిష్కరించాలి

బర్కత్‌పుర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంచినీటి లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి జలమండలి అధికారులను ఆదేశించారు. చలి కాలంలోనే కొన్ని ప్రాంతాల ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని, అన్ని ప్రాంతాలకు సమానంగా నీటి సరపరా జరిగేట్లు చూడాలని ఆమె కోరారు. మంగళవారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని కుత్బీగూడ, చప్పల్‌బజార్, మోతీమార్కెట్ తదితర ప్రాంతాలలో లోప్రెషర్ సమస్య ఉందని తెలిపారు. జలమండలి ఏఈ భావన, మేనేజర్ వెంకటేష్ యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బల్వీర్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మానసికంగా కృంగిపోయిన ఓ వ్యక్తి గుర్తుతెలియని విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్కడపల్లి వివేక్‌నగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్(34) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తూ భార్య, మూడు సంవత్సరాల కొడుకు, తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. ఆయన తండ్రి నర్సిములు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. కాగా సోమవారం సాయంత్రం చిక్కడపల్లిలో నివసించే శ్రావణ్‌కుమార్ సోదరి ఇంటికి కుటుంబసభ్యులంతా ఫంక్షన్‌కు వెళ్లారు. కాగా రాత్రి శ్రావణ్‌కుమార్ తిరిగి ఇంటికి చేరుకున్నాడు. గుర్తుతెలియని విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో అతడి కుటుంబసభ్యులు ఇంటికి తిరిగివచ్చి తలుపు తట్టడంతో ఎంతకూ తీయకపోవడంతో కిటికీలోంచి తలుపు తెరిచి లోనికి వెళ్లి చూడగా శ్రావణ్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్ (ఫైల్)

రాంనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మంగళవారం మృతి చెందాడు. అతడి మృతితో రాంనగర్‌లో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. రాంనగర్‌లోని రామాలయం ప్రాంతంలో నివాసం ఉంటున్న జి.ప్రవీణ్(20) గత ఆదివారం మలక్‌పేటలో జరిగే ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు రాంనగర్ నుంచి బైక్‌పై బయలుదేరాడు. మూసారాంబాగ్ బ్రిడ్జి స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి ప్రవీణ్ కిందపడ్డాడు. దీంతో అతడి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ప్రవీణ్ మంగళవారం మృతి చెందాడు. దీంతో అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యాంతమయ్యారు. ప్రవీణ్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటిపర్యాంతమయ్యారు.

కనులపండువగా శ్యాంబాబా జన్మదినం



దర్శనం కోసం వచ్చిన భక్తులు, స్వామివారు

బర్కతుపుర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్నగుట్టపై కొలువుదీరిన శ్యాంబాబా జన్మదిన వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణ నినాదాలతో శ్యాంబాబా మందిరం మారుమ్రోగింది. మేళతాళాలు, భజనలు కీర్తనలు ఆలపిస్తూ భక్తులు శ్యాంబాబా మందిరానికి చేరుకున్నారు. నగరంలోని చార్మినార్, మలక్‌పేట, ఇసామియా బజార్, రామంతాపూర్ సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి నిషాన్‌యాత్రలు నిర్వహించారు, భక్తులు ర్యాలీగా శ్యాంబాబా మందిరానికి చేరుకున్నారు. శ్యాంబాబా జన్మదిన వేడుకలు సందర్భంగా మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ వేడుకల్లో సేవాసమితి ప్రతినిధులు ఇంద్రజిత్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్, రాజువిగ్ తదితరులు పాల్గొన్నారు

రేషన్ బియ్యం డంపు కేంద్రంపై పోలీసుల దాడి, ఇద్దరి అరెస్ట్

కవాడిగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించడం కోసం వివిధ ప్రాంతాల్లో సేకరించి డంప్ చేసిన కేంద్రంపై గాంధీనగర్ పోలీసులు మంగళవారం దాడి చేసి 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి గాంధీనగర్ పీఎస్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం. భోలక్‌పూర్‌లో నివాసం ఉంటున్న ఎం.డి.ముజాహిద్ హుస్సేన్(24), మహ్మద్ ఫారుఖుద్దీన్(19)లు ముషీరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తక్కువ ధరకు రేషం బియ్యం సేకరించి అధిక ధరలకు విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సేకరించిన 20 క్వింటాళ్ల బియ్యాన్ని కృష్ణనగర్‌లోని ఓ కేంద్రంలో ఉంచినట్లు సమాచారం సేకరించిన పోలీసులు ఆ బియ్యం సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు.

ఉపవాసం ఆరోగ్యానికి మేలు

చిక్కడపల్లి: ఏకాదశి ఉపవాసం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు డా. అనంతలక్ష్మి అన్నారు. గీతా (భగవద్గీత) ఫౌండేషన్, నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామియాదవ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో కార్తీకమాస వైశిష్ట్యం అంశంపై ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా డా.అనంతలక్ష్మి మాట్లాడుతూ కార్తీకమాస వైశిష్ట్యం ఎంతో గొప్పదన్నారు.

కుటుంబ సర్వేతో అన్ని వర్గాలకు న్యాయం



పోచమ్మబస్తీలో స్టికర్లను అతికిస్తున్న తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు

రాంనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ పేర్కొన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పోచమ్మబస్తీలో మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ యూసీడీ కో-ఆర్డినేటర్ అశోక్‌కుమార్, ఎన్యూమరేటర్ బి.శైలజ, శ్రీమంత్‌గిరి, నరేష్‌గౌడ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

బర్కత్‌పుర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్ కోరారు. సంక్షేమ పథకాలు అందడానికి ఈ కులగణన ఎంతో దోహదపడుతుందన్నారు. మంగళవారం కాచిగూడలో నిర్వహించిన కులగణనలో పాల్గొని ఆశావర్కర్ల పనితీరును పరిశీలించి మాట్లాడారు.

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: కుటుంబ సర్వే ముషీరాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. రెండు రోజులుగా కుటుంబ వివరాలను సేకరించారు. 4 పేజీలు ఉన్న సర్వే బుక్‌లో 56 ప్రశ్నలకు వివరాలు నమోదు చేసేందుకు అరగంట నుంచి 40 నిమిషాల సమయం పడుతుందని ఎన్యూమరేటర్లు పేర్కొంటున్నారు.

బర్కత్‌పుర: తెలంగాణలో చేపట్టిన కుల గణన దేశానికే రోల్ మోడల్‌గా మారిందని, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమే సమగ్ర సర్వే అని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కుల గణనలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.



జీవీఎస్‌రాజును సన్మానిస్తున్న అతిథులు

సేవా కార్యక్రమాలు మానసిక సంతృప్తినిస్తాయి

చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు మానసిక సంతృప్తినిస్తాయని జేసీ అలుమ్ని క్లబ్ స్వచ్ఛంద సంస్థ జాతీయ సలహాదారులు ఆర్.సునీల్‌కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు వినయ్‌మెహతాలు పేర్కొన్నారు. మంగళవారం జేసీ అలుమ్ని క్లబ్ జోన్ 12 సదస్సు చిక్కడపల్లిలోని క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఈ ఏడాది అలుమ్ని క్లబ్ 12 జోన్ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నదని వివరించారు. జోన్ చైర్మన్ జీవీఎస్ రాజును సన్మానించారు. డా.చందన, నవీన్‌చావ్లా, డీవీఎస్‌పి గుప్తా, నాగేశ్వరరావు, మనోజ్‌టక్కర్ పాల్గొన్నారు. జోన్‌స్థాయిలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సభ్యులను అభినందించారు. నాట్యగురువు దివ్యారెడ్డి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో శివుడికి అభిషేకాలు

చిక్కడపల్లి, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆలయంలో ఆవరణలోని శివాలయంలో మంగళవారం శివుడికి పూజారులు, వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు శివపురాణం ప్రవచనం చేశారు. ఈవో మాచర్ల దేవనాథం తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి గర్వించే గాయని పి.సుశీల



బాలకామేశ్వరరావును సన్మానిస్తున్న త్రినాథరావు, శ్రీదేవి

చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి గర్వించదగ్గ గాయని పి.సుశీల అని ప్రముఖ గాయకుడు, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు అన్నారు. వీణాపాణి కళానిలయం, మాగ్నిఫీషెంట్ మ్యూజిక్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో ప్రముఖ సినీ నేపథ్యగాయని పి.సుశీల జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు బాలకామేశ్వరరావును సన్మానించిన త్రినాథరావు మాట్లాడుతూ.. సుశీలను ఆదర్శంగా తీసుకుని ఎందరో గాయనీమణులు గొప్పగా రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని డా. జీఎమ్ శ్రీదేవి, గాయకుడు, నటుడు దొంతి జంగయ్యగౌడ్, వరలక్ష్మి, వేణుగోపాల్, వరలక్ష్మి, కనకరత్నం, ఇంద్రాణి పాల్గొన్నారు.

పార్కులను ఆధునీకరించాం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అభివృద్ధి చేసిన పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో ఉన్న పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించి కోట్లాది రూపాయలతో సుందరీకరణ చేయిస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాక డివిజన్ తులసీనగర్ కాలనీలోని సమోసా పార్కును రూ.30 లక్షలతో ఆధునీకరించిన పార్కును ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీవాసులతో పార్కులో కలియతిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలలోని పార్కులను అందంగా తీర్చిదిద్ది స్థానికులకు ఆహ్లాదాన్ని అందజేస్తున్నామన్నారు. ఇంకా కొన్ని పార్కులలో పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి పునరంకితమై పని చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.